# గులాబీ జెండానే శ్రీరామరక్ష

- ప్రతిపక్షాలను నమ్మితే గోసపడుతం
- బీఆర్ఎస్ అంటే వెలుగు.. కాంగ్రెస్ అంటే చీకటి
- బీజేపీ మోటర్లకు మీటర్లు పెడతానంటున్నది
- ఏది కావాలో ఆలోచించి ఓటు వేయండి
- అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి
- మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్
- ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తనయుడు పృథ్వీరెడ్డి
- గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజల ఘనస్వాగతం


తొగుట మండలం గుడికందులలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఫరూఖ్‌హుస్సేన్, పృథ్వీరెడ్డి

తొగుట, నవంబర్ 15: గులాబీ జెండా నీడలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే ప్రయోజనం లేదని మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్‌హుస్సేన్, బీఆర్ఎస్ దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి కుమారుడు కొత్త పృథ్వీరెడ్డి అన్నారు. పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని, ప్రతిపక్షాల మాయమాటలు నమ్మితే గోసపడతామన్నారు. బుధవారం తొగుట మండలంలోని వర్ధరాజుపల్లి, గోవర్ధనగిరి, గుడికందుల, ఘనపూర్, మోట్టు, బండారుపల్లి తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం, రోడు షోలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారానికి అపూర్వ స్పందన లభించింది. మహిళలు బతుకమ్మలు, బోనాలు, మంగళహారతులు డప్పుచప్పులతో దారి పొడవునా ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. గత ప్రభుత్వాల పాలనలో అన్నివర్గాలు అనేక ఇబ్బందులు పడ్డారని, 2014 తర్వాత బీఆర్ఎస్ సర్కార్ పాలనలో అటు అభివృద్ధి ఇటు సంక్షేమంలో ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు. రాష్ట్రంలో విపక్షాలకు స్థానం లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ సమాజం ఎప్పటికీ సీఎం కేసీఆర్ వెంటే నడుస్తుందని, ఆయన మీద ప్రజలు పెంచుకున్న విశ్వసనీయత అటువంటిదని పేర్కొన్నారు. అధికారం కోసం ఎన్నో హామీలిస్తున్నా ప్రతిపక్షాలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో 24 గంటల ఉచిత విద్యుత్ ఎందుకు సరఫరా కావడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడిందని, కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపులో వివక్ష చూపుతుందని ఆరోపించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వని ప్రధాని మోదీకి రాష్ట్రంలో ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, ఈ ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు, రైతులు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గత ఉప ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన ఎమ్మెల్యే రఘునందర్‌రావును గ్రామాల్లోకి వస్తే నిలదీయాలన్నారు. కాంగ్రెస్ నాయకులు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కనిపిస్తారని, ఢిల్లీకి గులాంగిరి చేసే పార్టీలను భూస్థాపితం చేయాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న కారు గుర్తుకు ఓటు వేసి దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జడీపల్లి రాంరెడ్డి, సొసైటీ చైర్మన్ హరికృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు కలీమొద్దీన్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు బో ధన కనుకయ్య, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, కుంబాల శ్రీనివాస్, ఎంపీటీసీ కొమ్ము శరత్, స్వామి, సర్పంచ్‌లు మల్లయ్య, ఎల్లం, కుంభ శారధ, రఘోత్తంరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గోవర్ధనగిరిలో జై కేపీఆర్ అంటూ పూలతో వేసిన చిత్రంతో ఘన స్వాగతం

## ప్రభాకర్‌రెడ్డిని గెలిపించుకుందాం

దుబ్బాక టౌన్, నవంబర్ 15: ఇప్పటికే బీజేపీ మాయమాటలు, మోసపూరిత వాగ్ధానాలతో ఎంతో వెనుకబడ్డాం.. మరోసారి ఆగం కావద్దు, ఆలోచించండి, దుబ్బాక అభివృద్ధి కొత్త ప్రభాకర్‌రెడ్డితోనే సాధ్యం.. సీఎం కేసీఆర్‌కు దుబ్బాకపై ప్రత్యేకమైన ప్రేమ ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక మున్సిపాలిటీలోని పలు వార్డులతో పాటు చెల్లాపూర్, మల్లాయిపల్లి, దుంపలపల్లి, ధర్మాజీపేట, చేర్వాపూర్ వార్డుల్లో పార్టీ శ్రేణులు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దుబ్బాకలోని 18వ వార్డులో ప్రచారం నిర్వహించిన చైర్‌పర్సన్ వనిత మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రాగానే మ్యానిఫెస్టో తూచ తప్పక అమలు జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ గడ్డపై పుట్టిన కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపై ఉన్నదన్నారు. 1వ వార్డులో బీఆర్ఎస్ దుబ్బాక యువత ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి ఘన విజయం సాధించాలని, ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని దుబ్బాకకు చెందిన సిందె గణేశ్ కాశీయాత్రను దుబ్బాకనుంచి ప్రారంభించారు.


దుబ్బాక 18వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి

ప్రచారంలో కౌన్సిలర్లు నిమ్మ రజితాయాదగిరి, లొంక రాజవ్వలచ్చయ్య, గోనెపల్లి దేవలక్ష్మీసంజీవరెడ్డి, పులిగారి కల్పన ఎల్లం, బట్టు యాదమ్మ ఎల్లం, పల్లె మీనారామస్వామిగౌడ్, దేవుని లలిత, కూరపాటి బంగారయ్య, మాజీ సర్పంచ్ వడ్లకొండ సుభద్రాశ్రీధర్, రాష్ట్ర నాయకుడు రొట్టె రాజమౌళి, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండెల్లి ఎల్లారెడ్డి, నాయకులు ఆకుల దేవేందర్, శ్రీరాం రవీందర్, సంగీత పాల్గొన్నారు.


దుబ్బాక మండలం ఆకారంలో ఇంటింటి ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు

## ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

దుబ్బాక, నవంబర్ 15: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న బీఆర్ఎస్‌ను ఆదరించాలని బీఆర్ఎస్ దుబ్బాక మండల పరిశీలకుడు ఎల్లు రవీందర్‌రెడ్డి, దుబ్బాక జడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి కోరారు. బుధవారం దుబ్బాక మండలం ఆకారం, పెద్దగుండవెల్లి, బల్వంతాపూర్, హసన్‌మీరాపూర్, రఘోత్తంపల్లి, చీకోడు తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఆకారంలో బీఆర్ఎస్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి ఘన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి దుబ్బాక ఎమ్మెల్యేగా పోటీ చేయడం నియోజకవర్గ ప్రజల అదృష్టమన్నారు. అలాంటి మంచి నాయకుడిపై ఓ దుండగుడు కత్తితో దాడి చేస్తే బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు సోషల్ మీడియాలో వక్రీకరిస్తూ అవహేళన చేయడం అతడి పైశాచికానికి నిదర్శనమని మండిపడ్డారు. పని చేసే బీఆర్ఎస్‌కు పట్టం కట్టాలని కోరారు. బీజేపీ మాయమాటలకు మోసపోవద్దని, కారు గుర్తుకు ఓటేసి ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి, ఆకారం గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు సద్ది రాజిరెడ్డి, నాగభూషణం, ఎంపీటీసీ పోలబోయిన లక్ష్మీనారాగౌడ్, నాయకులు కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, రాజయ్య, తౌడ శ్రీనివాస్ ఉన్నారు.

## సీఎం కేసీఆర్‌తో వేగంగా అభివృద్ధి


మిరుదొడ్డిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మిరుదొడ్డి, నవంబర్ 15: సీఎం కేసీఆర్ కృషితో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి జరిగిందని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకుడు గొల్ల రాములు, పార్టీ గ్రామ అధ్యక్షుడు ధర్మారం బాబు అన్నారు. బుధవారం మిరుదొడ్డిలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేస్తే కష్టాలను కొని తెచ్చుకుట్టే అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిరినేని వెంకటయ్య, గొట్టం స్వామి, ఎల్లుముల శేఖర్, మద్దెల రాజయ్య, మల్లయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లోకి ప్రతిపక్ష నేతలు


తిర్మాలాపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరుతున్న బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

రాయపోల్, నవంబర్ 15: దౌల్తాబాద్ మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన పలువురు నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్శితులై తాము బీఆర్ఎస్‌లో చేరి దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన 30 మందికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సర్వుగారి యాదవరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ సత్తయ్య, నాయకులు కరికే మహేశ్, నిరుడి మల్లేశ్, రవి, కరుణాకర్, పరశురాములు, అభిలాష్, నక్క రాజు పాల్గొన్నారు.

## విద్యార్థులు శ్రద్ధతో చదవాలి


విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి, నవంబర్ 15: తల్లిదండ్రుల కలలను సాకారం చేయడానికి విద్యార్థులు చిన్ననాటి నుంచే శ్రద్ధతో కష్టపడి విద్యను అభ్యసించాలని సిద్దిపేట డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండల పరిధిలోని కొండాపూర్ జడ్పీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి నుంచి జవాబులు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీఈవో ఎల్లంకి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు విద్యార్థులు మానసికంగా సిద్ధంగా ఉంటూ ఏవిధంగా సన్నద్ధం కావాలో మార్గదర్శనం చేశారు. పాఠశాలలో ప్రతి సోమవారం ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిందండ్రులకు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. రోజూ ఉదయం ఒక గంట సమయం కేటాయించి రోజుకో సబెక్టు చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయానుకూలంగా పాఠశాలకు హాజరు కావాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. డీఈవో వెంట మిరుదొడ్డి ఎంఈవో జోగు ప్రభుదాస్ ఉన్నారు.